

కుమారులు ఉన్నా భిక్షాటన

ఇద్దరు కుమారులు ఉన్నా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలికి అధికారులు ఆశ్రమం కల్పించారు. - 8లో



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. - 9లో



క్రీడలతో మానసికోల్లాసం

పాఠశాలల్లో క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని వక్తలు పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త విద్యార్థులతో పాటు గతంలో స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులు కూడా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ telnganaepass.cgg.gov. in లో దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 31వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని సూచించారు.

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుపై శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు జిష్ణుదేవ్‌వర్మను భువనగిరి జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భువనగిరిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సహకారం అందించాలని గవర్నర్‌ను లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు.

జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతల స్వీకరణ



నూతన సంక్షేమ అధికారి నర్సింహారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీడీపీఓలు

భువనగిరిటౌన్ : జిల్లా సంక్షేమ అధికారిగా కే.నర్సింహారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జోగిపేట సీడీపీఓగా పనిచేస్తున్న నర్సింహారావు పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణవేణి సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహారావును సీడీపీఓలు ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు శాగంటి శైలజ, రేఖల స్వరాజ్యం, జ్యోత్స్న, వెంకటరమణ, కె.రమ, సమీరా ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే చీడపీడల నివారణ

భువనగిరి రూరల్ : సరైన సస్యరక్షణ చర్యలతోనే పంటలకు చీడపీడలు ఆశించకుండా నివారించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం భువనగిరి మండలంలోని వీరవెల్లిలో అధిక సాంద్రత గల పత్తి చేలను వారు పరిశీలించారు. వర్షాల కారణంగా భూముల్లో పదును పెరిగిందని, తెగుళ్లు ఆశించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కె.మమత, వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా ఆండాళ్‌దేవిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టింపజేసి ఊంజల్‌సేవోత్సవం నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయపర్వాలు కొనసాగాయి. వేకువజామున స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, అర్చన చేశారు. అలాగే ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజా కైంకర్యాలు గావించారు.



బోడ కాకరకాయ @ 400

భువనగిరిటౌన్ : వర్షాకాలం సీజన్‌లో మాత్రమే లభించే బోడ కాకరకాయకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అటవీ ప్రాంతంలో దొరికే వీటిని భువనగిరి రైతుబజార్‌లో కిలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ గుణాలు ఉండడంతో చికెన్ కంటే ఎక్కువ ధర ఉన్నప్పటికీ వీటిని కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

నేడు ఎన్నికల కమిషనర్ రాక

భువనగిరి టౌన్ : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని శనివారం యాదాద్రికి రానున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగేతెలిపారు. స్వయంభూలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 6గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 7:45కు యాదా ద్రికి చేరుకుంటారని, స్వామివారి సేవలో పాల్గొన్న అనంతరం 11 గంటలకు తిరుగుపయనం అవుతారని తెలిపారు.

విద్యాశాఖలో ఎందుకిలా?

మూడు నెలల్లో సెలవుపై వెళ్లిన ముగ్గురు డీఈఓలు

- ఒత్తిళ్లే కారణమా?
- డీఈఓ లేకపోవడంతో విధానపరమైన నిర్ణయాల అమలులో జాప్యం
- పెండింగ్‌లో బిల్లులు, ఫైళ్లు
- పాఠశాలలపైనా కొరవడిన పర్యవేక్షణ



సాక్షి యాదాద్రి : నారాయణరెడ్డి, ఆ తరువాత ప్రశాంత్‌రెడ్డి, ఇప్పుడు నర్సింహ.. మూడు నెలల్లోనే ముగ్గురు డీఈఓలు మారారు. వారంతా ఒక్కొక్కరుగా సెలవుపై వెళ్లడం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. వర్క్ అడ్జస్ట్‌మెంట్, ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికతో పాటు పలు రకాల పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల ఒత్తిళ్ల నేపథ్యంలో డీఈఓలు సెలవుమార్గం ఎంచుకుంటున్నారని టాక్ వినిస్తోంది. ఫలితంగా విద్యాశాఖలో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేయాలన్న సమాచారం 16వ తేదీ సాయంత్రం వరకు ప్రధానోపాధ్యాయులకు అందలేదు.

ఏం జరుగుతోంది?

డీఈఓలు సెలవుపె వెళ్లడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఓ ఉపాధ్యాయురాలు ప్రిఫెరెన్షియల్ బదిలీ విషయంలో నకిలీ సర్టిఫికెట్ సమర్పించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఫిర్యాదు అందడంతో అప్పటి డీఈఓ నారాయణరెడ్డి విచారణ జరిపి ఉపాధ్యాయురాలికి నోటీసు ఇచ్చారు. ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని ఆమెపై సస్పెన్షన్ వేటుపడకుండా డీఈఓపై తీవ్రమైన వత్తిడి తెచ్చి అడ్డుకున్నట్లు సమాచారం.

వర్క్ అడ్జస్ట్‌మెంట్ వద్దని..

ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ విషయంలోనూ డీఈఓకు ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇచ్చిన జీఓ ఎంఎస్ నంబర్ 25 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంటుందని డీఈఓ చెప్పినా ఒత్తిడి తెచ్చి ప్రొసీడింగ్స్ నిలిపివేయించారు. మరోవైపు పలు ఉపాధ్యాయ సంఘాలు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఆర్డర్‌ను ఎందుకు అమలు చేయడం లేదని డీఈఓపై ఒత్తిడి పెంచారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో విధులు నిర్వర్తించలేక అనారోగ్యం కారణంతో డీఈఓ నారాయణరెడ్డి సెలవుపై వెళ్లిపోయారు.

ఏడీకి అదనపు బాధ్యతలు

డీఈఓ నారాయణరెడ్డి సెలవుపై వెళ్లడంతో ఏడీ ప్రశాంత్‌రెడ్డికి డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రశాంత్‌రెడ్డి.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను విజయవంతంగా పూర్తిచేశారు. అయితే ఓ టీచర్ డిప్యూటేషన్ విషయంలో ఓ ప్రజాప్రతినిధి తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. కాగా ఎంఈఓ ఇచ్చిన నివేదికను కాదని నిబంధనలకు విరుద్ధంగా మరో జిల్లాకు ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పంపలేమని ఇంచార్జి డీఈఓ చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారని, ఒత్తిళ్లు భరించలేక ప్రశాంత్‌రెడ్డి కూడా ఆరోగ్యం బాగాలేదని సెలవుపై వెళ్లారు. దీంతో మరోసారి డీఈఓ పోస్టు ఖాళీ ఏర్పడింది. గతంలో ఇక్కడ డీఈఓగా పనిచేసి నల్లగొండ డైట్ కళాశాలకు లెక్చరర్‌గా వెళ్లిన నర్సింహను మరోసారి భువనగిరి జిల్లా డీఈఓగా ప్రభుత్వం నియమించింది. ఈనెల 2వ తేదీన ఆయన విధుల్లో చేరారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక వివాదాస్పదం అయ్యింది. కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయకుండానే ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ఎలా చేస్తారని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డీఈఓ తీరును తప్పుపట్టాయి. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని డీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించాయి. ఇదిలా ఉండగానే నారాయణరెడ్డి తెచ్చిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రొసీడింగ్ ఆర్డర్ బయటకు తీయాలని కొన్ని సంఘాల నుంచి ఒత్తిడి మొదలైంది. కాగా కొందరు ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులతో డీఈఓకు ఫోన్లు చేయించి వర్క్‌ఆర్డర్ బయటకు తీయవద్దని ఆయనపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఇక్కడ పనిచేయలేనని నర్సింహ కూడా సెలవుపై వెళ్లారు.

ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం

డీఈఓ లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. పదవ తరగతి ఫలితాల్లో గత సంవత్సరం జిల్లా అట్టడుగుస్థాయికి పడిపోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డీఈఓ లేకపోవడం వల్ల కలెక్టర్ హనుమంతు కే జెండగే పాఠశాలలను పర్యవేక్షిస్తున్నారు.

పేరుకుపోతున్న ఫైళ్లు

డీఈఓ లేకపోవడంతో ప్రధానమైన బిల్లులు, వివిధ ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ఫైల్, ప్రొబేషనరీ పీరియడ్‌కు సంబంధించి వారి సత్ప్రవర్తనపై పోలీస్ శాఖ ఇచ్చిన నివేదికలు డీఈఓ కార్యాలయంలో పెండింగ్ ఉన్నాయి. వీటితోపాటు హెచ్‌ఎంల ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవ్ ఫైళ్లు పెండింగ్ ఉన్నాయి, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులకు సంబంధించి సెలవుల ప్రొసీడింగ్ తీయాల్సి ఉంది. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న పలువురు ఉపాధ్యాయుల ఈఎల్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ తీసే పరిస్థితి లేదు.

సాగునీటి ప్రాజెక్టులకు ఊతం



మన్నెవారిపల్లి వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు

- ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకొని నిధుల కేటాయింపునకు హామీ
- ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పనులపై సమీక్ష
- మూసీ కాలువలకు నిధులు మంజూరు చేయాలని కోరిన గుత్తా సుఖేందర్‌రెడ్డి



సొరంగ మార్గాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

చందంపేట : ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు ఊతమిచ్చేలా శుక్రవారం మన్నెవారిపల్లి వద్ద (ఎస్ఎల్‌బీసీ టన్నెల్–1) డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన సాగింది. డిప్యూటీ సీఎంతో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ –1 ఔట్‌లెట్ పనులను పరిశీలించారు. టన్నెల్ లోపలికి 600 మీటర్లు వెళ్లి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తిగా రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టుగా ఎస్ఎల్‌బీసీనిప్రారంభించారని తెలిపారు. శ్రీశైలం డెడ్ స్టోరేజీలో ఉన్నా.. పూర్తిగా 43 కిలోమీటర్ల మేర గ్రావిటీ ద్వారానీరు ప్రవహిస్తూ ఇక్కడ సుమారు మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని పేర్కొన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిండి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఓవర్ ఫ్లో అవుతున్నందున గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్లను నింపుకోవచ్చునని, అలాగే పిల్లాయిపల్లి కాలువ, బునియాదిగాని కాలువ, ధర్మారెడ్డి కాలువలకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సెల్బీసీ కోసం గతంలో దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి వెంటపడ్డానని, ఈ ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు ప్రాంతాల్లోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి పట్టుపట్టి తనను అమెరికా పంపించి టన్నెల్ టీబీఎం మిషన్ వచ్చేలా ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఎంపీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ డిండి ఇతర ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర స్థాయిలో ఫారెస్ట్ క్లీయరెన్స్‌కు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో కొత్తగా మూడు లిఫ్టు ఇరిగేషన్లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.

విద్యుత్ శాఖపైనా సమీక్ష..

అంతకుముందు చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్ నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో విద్యుత్ శాఖ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే వంశీకృష్ణ, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, ఇరిగేషన్ శాఖ స్పెషల్ సెక్రెటరి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎస్సెల్బీసి టన్నెల్ కాంట్రాక్టర్ జయప్రకాశ్ పంకజ్‌గౌర్, ఎస్సెల్బీసీ ప్రాజెక్టు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని చీదరించుకుంటున్నారు

- ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



ఆన్‌లైన్‌లో సభ్యత్వం చేయిస్తున్న ఎమ్మెల్సీ

చౌటుప్పల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజాదరణ కోల్పోయిందని, అన్ని వర్గాలు చీదరించుకుంటున్నాయని బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడంతో ప్రజలు తిరగబడతారని గ్రహించిన సీఎం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ ప్రపంచానికే దిక్సూచిగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని బీజేపీ శాసిస్తుందన్నారు. మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కా ర్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కార్యదర్శులు ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, నాయకులు కైరంకొండ అశోక్, దాసోజు భిక్షమాచారి, ఊడుగు వెంకటేశం, ఉబ్బు బుచ్చయ్య, కట్ట కృష్ణ, ఉప్పు ఆంజనేయులు, కానుగు కొండల్, పాలెం అశోక్ పాల్గొన్నారు.

'జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం'

వలిగొండ : జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. శుక్రవారం వలిగొండ మండలం పులిగిల్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానం వల్ల ఐదేళ్లు ఉండాల్సిన ప్రభుత్వాలు రెండు, మూడేళ్లకే కూలిపోయే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలో భాగమే జమిలి ఎన్నికలన్నారు. కేంద్ర నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, కల్లె సుదర్శన్ రెడ్డి, కొమ్మిడి లక్ష్మారెడ్డి, వాకిటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైన్ పడుద్ది.. చూసి వెళ్లండి



వాహనదారులు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడ చలానా వేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించకుండా పెద్ద మొత్తంలో ఫైన్ విధిస్తున్నారని వాపోతున్నారు. భువనగిరిలోని ఎల్లమ్మ గుడి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, రూల్స్ పేరుతో చలానా రాస్తూ వాహనదారుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -భువనగిరి టౌన్

ఖాళీ ప్లాట్లు.. ప్రజలకు పాట్లు

మురుగు, చెత్తకు నిలయాలుగా ఓపెన్ ప్లాట్లు

- పెరుగుతున్న దోమల బెడద
- వ్యాధులబారిన గుట్ట పట్టణ ప్రజలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం



యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో మురుగు నీటితో నిండిన ప్లాట్

యాదగిరిగుట్ట : ఓపెన్ ప్లాట్లు స్థానికులకు పాట్లు తెచ్చిపెడుతున్నాయి. చెట్లు మొలిచి, మురుగు, వర్షపు నీటితో నిండి అపరిశుభ్రత మధ్య జనం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో యజమానులకు నోటీసులు జారీ చేస్తామని సమాధానం చెప్పడమే తప్పా.. ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

వందల్లో ఓపెన్ ప్లాట్లు

దినదినాభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అదే స్థాయిలో వెంచర్లు వెలుస్తున్నాయి.భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రజలు వెంచర్లలో పెద్ద మొత్తంలో ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తుండగా, మరికొందరు అలాగే వదిలేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 170 వరకు ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. అనధికారికంగా వాటి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. కాగా ఓపెన్ ప్లాట్లలో పిచ్చి మొక్కలు మొలవకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా మొరంతో నింపడంతో పాటు చుట్టూ ప్రహరీలు నిర్మించుకోవాలన్న నిబంధనలున్నా యజమానులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మురుగు కూపాలుగా మారుతుండడంతో దోమల వ్యాప్తి, పందుల సంచారం పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వర్షాకాలంలో పట్టణవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో 4,900 వరకు నివాస గృహాలున్నాయి. 20 వేలకు పైగా జనాభా నివసిస్తోంది.

అదనపు భారం

ఓపెన్‌ప్లాట్లు మున్సిపాలిటీకి భారంగా మారాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో కౌన్సిలర్లే చదును చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకుగాను డోజర్‌కు గంటకు రూ.500 నుంచి రూ.1,000, జేసీకి రూ.3000 వరకు చార్జ్ చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు.



కొత్తగుండ్లపల్లిలో కంపచెట్లతో నీటితో నిండిన ఓపెన్ ప్లాట్



యాదగిరిగుట్ట పట్టణంలోని గణేష్‌నగర్‌లో..

దోమల వ్యాప్తి పెరిగింది



ఓపెన్‌ప్లాట్లన్నీ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీనికి తోడు వర్షాలకు నీరు చేరడంతో దోమల వ్యాప్తి పెరిగింది. పందులు కూడా చేరడంతో దుర్గంధం వస్తుంది. దోమల కారణంగా ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ముఖ్యంగా చిన్ని పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్యంకోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

-బండి అనిల్, కొత్తగుండ్లపల్లి

పాములు వస్తున్నాయి



మా ఇంటి ఎదుట, పక్కన ఉన్న ఓపెన్ ప్లాట్ల నిండా కంపచెట్లు మొలిచాయి. వాటినుంచి ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయి. మరోవైపు దోమలు కూడా విపరీతంగా వస్తున్నాయి. ఓపెన్ ప్లాట్లు అనారోగ్యానికి కారణమవుతుండడంతో మున్సిపల్ అధికారులు చొరవచూపాలి. యజమానులతో మాట్లాడి శుభ్రం చేయించాలి.

-బొడ్డు యాదగిరి, గణేష్‌నగర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిస్తలేరు



మా ఇంటి పక్కల ఉన్న ఓపెన్ ప్లాట్లు పెద్ద సమస్యగా మారాయి. వర్షం నీరు, మురుగు చేరడంతో దుర్వాసన వస్తుంది. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే చాలా మంది ఆస్పత్రుల పాలయ్యారు. సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేయించాలి.

-పి.ఉప్పలయ్య, 8వ వార్డు, యాదగిరిగుట్ట

క్లుప్తంగా

కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

భానుపురి (సూర్యాపేట): హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బూరుగడ్డ గ్రామ ప్రభుత్వ భూమిని ఇతరులకు బదిలీ చేసిన కంప్యూటర్ ఆపరేటర్ వత్సవాయి జగదీష్‌ను టర్మినేట్ చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలను పరిశీలిస్తున్న క్రమంలో అనుమానం రావడంతో బూరుగడ్డ రెవెన్యూ రికార్డులను పరిశీలించాల్సిందిగా ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించామని పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జగదీశ్ నవంబర్ 2019 నుంచి ఫిబ్రవరి 2020 మధ్య కాలంలో హుజూర్‌నగర్, బూరుగడ్డ గ్రామాల్లోని సర్వేనంబర్లు 439, 604 ,602 ,608, 1041, 1041 గల ప్రభుత్వ భూమిని తన బంధువుల పేర్లపై మార్పిడి చేసినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. అప్పటి తహసీల్దార్‌ను, ఇతర అధికారులను సూక్ష్మ విచారణ చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ బీఎస్ లతను విచారణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భూమిపై లావాదేవీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముమ్మరంగా సాగర్ కాల్వ మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామ చంద్రాపురం సమీపాన సాగర్ ఎడమ కాల్వకు పడిన గండి వద్ద మరమ్మతు పనులు రాత్రింబవళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రూ.2.40 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులకు చెన్నకేశవాపురం గ్రామం నుంచి నాణ్యమైన మట్టిని తీసుకొచ్చి వినియోగిస్తున్నారు. ఈ పనులను శుక్రవారం ఇరిగేషన్‌శాఖ సీఈ రమేష్‌బాబు పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఈ శివధర్మతేజ, ఈఈ రామకిషోర్, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ ఉన్నారు.

జూదరుల అరెస్ట్

వలిగొండ: మండలంలోని నరసాయగూడెంలో పేకాట ఆడుతున్న 11 మందిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.7,300 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడ్డ ముగ్గురిపై కేసు



ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ నిందితులు

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారులు వేర్వేరుగా నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 లీటర్ల సారా, 3 ద్విచక్ర వాహనాలు, 35 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ జిన్నా నాగార్జునరెడ్డి వివరాలు వెల్లడించారు. మఠంపల్లి మండలం కొత్త తండాకు చెందిన బాణోత్ బాలు, ధరావత్ నాగు ద్విచక్ర వాహనాలపై వేర్వేరుగా 8 లీటర్ల చొప్పున సారా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా చింతలపాలెంనకు చెందిన శేషం రామకృష్ణ తన ద్విచక్ర వాహనంపై ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి సుమారు 35 కిలోల బెల్లం అక్రమంగా తరలిస్తున్నాడు. దొండపాడు వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో బెల్లంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జగన్మోహన్‌రెడ్డి, దివ్య, సిబ్బంది నాగరాజు, రవి కుమార్, రుక్మారెడ్డి, ధనుంజయ్, స్వాతి పాల్గొన్నారు.

ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న సాయిప్రకాష్



తల్లిదండ్రులతో ఐపీఎస్ అధికారి ధరావత్ సాయిప్రకాష్

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం సిద్ధిసముద్రం తండాకు చెందిన ఉపాధ్యాయుడు ధరావత్ రవీందర్, సరోజల కుమారుడు ధరావత్ సాయిప్రకాష్ హైదరాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ ట్రెనింగ్ పూర్తి చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం అకాడమీలో జరిగిన దీక్షాంత్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. సాయిప్రకాష్ చిన్నతనం నుంచే చదువులో ముందంజలో ఉండేవారు. సివిల్స్‌పై మక్కువతో ఇంటర్ పూర్తికాగానే హైదరాబాద్‌లోని ప్రముఖ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం పంజాబ్ కేడర్‌కు ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. పేదవాళ్లకు సాయం చేయడమే తన లక్ష్యమని, సైబర్ నేరాల నియంత్రణ, మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తానని సాయిప్రకాష్ తెలిపారు.

కుటుంబాన్ని కోల్పోయి.. ఒంటరైన బాలుడు



బియ్యం అందజేస్తున్న రామకృష్ణ యాదవ్

మునగాల : మండలంలోని గణపవరం గ్రామంలో కుటుంబాన్ని కోల్పోయిన ఓ బాలుడు ఒంటరయ్యాడు. దాతలు ముందుకొచ్చి చదివించాలని వేడుకుంటున్నాడు. గ్రామానికి చెందిన పగిళ్ల బ్రహ్మయ్య– నాగేంద్ర దంపతులు అనారోగ్యం బారిన పడి పదేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి మహేశ్వరి, సాయిభార్గవ్ అనే ఇద్దరు సంతానం. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలిద్దరూ తమ నాయనమ్మ వద్ద ఉంటున్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మహేశ్వరి మూడు రోజుల క్రితం జ్వరంతో మృతి చెందింది. దీంతో తమ్ముడు సాయి భార్గవ్ వీధిన పడ్డాడు. అతను ప్రస్తుతం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. వృద్ధాప్యంలో ఉన్న నాయనమ్మకు సాయి భార్గవ్ పోషణ కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ఎన్‌ఆర్‌ఐలకు తెలపగా బాలుడిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు గంధం నాగరాజు, దేశగాని ఫణీందర్, నెమ్మాది శ్రీనివాస్‌లు ఆర్థికసాయం పంపారు. రామకృష్ణయాదవ్ 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

డిండి ఎత్తిపోతల పూర్తి చేయాలి

- డిప్యూటీ సీఎం, మంత్రులకు వినతిపత్రం అందజేసిన సీపీఐ, సీపీఎం నాయకులు



డిప్యూటీ సీఎం, మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

దేవరకొండ: దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. శుక్రవారం చందంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులకు సంబంధించి నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పెండింగ్ పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ,మైనొద్దీన్, బుచ్చిరెడ్డి, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

డీపీఆర్ ఆమోదించాలి

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని, మూసీ సుందరీకరణకు నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు సీపీఎం బృందం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్కలగండి టన్నెల్‌కు రూ.2,200కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, మల్లేశం, బండ శ్రీశైలం, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామన్నపేట: మండలంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సివిల్ సప్లయ్ అధికారులకు అందిన సమాచారం మేరకు రైస్ మిల్లు వద్ద ఆగిన ఆటోను తనిఖీ చేయగా ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడ్డాయి. అధికారులు మిల్లులో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన 85 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బాలమణి తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ అంజయ్య, సిబ్బంది ఉన్నారు.

87 కేసుల్లో రూ.1.88 లక్షల జరిమానా

హుజూర్‌నగర్ : వివిధ కేసుల్లో నిందితులకు శుక్రవారం హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ రూ.1,88,200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో 74 మంది, వివిధ నేరాలకు పాల్పడిన 13 కేసుల్లోని నిందితులు న్యాయమూర్తి ఎదుట తమ నేరాలు అంగీకరించారు. దీంతో వారికి రూ 1,88,200 జరిమానాలు విధించారు.

యువకుడి మెడలో బంగారు గొలుసు చోరీ

చౌటుప్పల్: స్నేహితురాలితో మాట్లాడుతున్న యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి అతడి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ సంఘటన గురువారం రాత్రి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఇండోర్ స్టేడియం వద్ద చోటుచేసుకుంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని హోస్టర్ పరిశ్రమలో పని చేస్తున్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురంతండాకు చెందిన తేజావత్ కళ్యాణ్ పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి పట్టణ కేంద్రంలోని ఇండోర్‌స్టేడియం ప్రాంగణంలోని పాత భవనం వద్ద తన స్నేహితురాలితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు అక్కడికి వచ్చి యువకుడిపై దాడి చేసి అతడి మెడలో ఉన్న 1.6 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠశాల వంట గదిలో సామగ్రి అపహరణ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ఎస్‌ఎస్‌పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలోని వంటగదిలో గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్, వంట సరుకులు ఎత్తుకెళ్లారు. హెచ్‌ఎం సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పాఠశాలను శుభ్రం చేసేందుకు వచ్చిన స్కావెంజర్ నాగమ్మ వంటగది తాళం, తలుపు చెరిచి ఉండటాన్ని గమనించి హెచ్‌ఎంకు తెలిపింది. ఆమె వచ్చి చూడగా.. వంట గదిలో గ్యాస్ సిలిండర్, రూ.3 వేల విలువ గల వంట సరుకులు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ముత్తయ్య అక్కడకు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. హెచ్‌ఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

వేములపల్లి (మాడుగులపల్లి) : అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ప్రమాదవశాత్తు ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గరిడేపల్లి మండలంలోని పొనుగోడుకు చెందిన పసుపులేటి నాగయ్య తన కారులో పనినిమిత్తం మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో మాడుగులపల్లి మండలం కొత్తగూడెం వద్దకు రాగానే కారులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కారులో చిక్కుకున్న నాగయ్యను కారు అద్దాలు పగులకొట్టి బయటకు తీశారు. అప్పటికే గాయాలతో ఆపస్మారకస్థితిలోకి వెళ్లిన అతడిని అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది.

నల్ల బెల్లం, పటిక పట్టివేత



అధికారులకు పట్టుబడిన నల్ల బెల్లం

పెద్దఅడిశర్లపల్లి : అక్రమంగా తరలిస్తున్న 30క్వింటాల నల్లబెల్లం, 20క్వింటాల పటిక, 20లీటర్ల సారాను నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం అర్ధరాత్రి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నారు. నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్, దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన మెగావత్ కిషన్ 70బస్తాల నల్లబెల్లాన్ని అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దవూర మండలంలోని పర్వేదుల వద్ద పట్టుకున్నారు. అతడిని విచారించి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట శివారులో ఉన్న ఓ బొలేరో వాహనంలో మరో 30బస్తాల నల్లబెల్లం, 2బస్తాల పటిక, 20లీటర్ల సారాయి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బెల్లంతో పాటు రెండు వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ నరసింహ, మల్లేష్, కృష్ణ, స్వామి, శ్రీను, శేఖర్‌రెడ్డి, నాగరాజు, హరీష్ ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రెడ్డి

కేతేపల్లి: మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో ఈనెల 17న జరిగిన వ్యక్తి హత్య కేసును పోలీసులు చేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి శుక్రవారం కేతేపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. చెర్కుపల్లి గ్రామానికి చెందిన పిట్టల సైదులు(50) తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య ప్రమీల, కుమారుడు నవీన్, కుమార్తె ఉన్నారు. సైదులు పేరు మీద పట్టా ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని తమ పేరు మీద పట్టా చేయాలని భార్య ప్రమీల, కుమారుడు నవీన్‌లు సైదులుపై ఒత్తిడి చేశారు. ఇంకా వివాహం కాని కుమారుడికి భూమి పట్టా చేసేందుకు సైదులు అంగీకరించకపోవటంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈనెల 17న రాత్రి సైదులు బయటి నుంచి ఇంటికి రాగానే భార్య, కుమారుడు కలిసి రోకలిబండతో సైదులు తలపై బలంగా కొట్టారు. దీంతో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పిట్టల వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేతేపల్లి పోలీసులు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం అదే మండలంలోని కొండకిందిగూడెం గ్రామం వద్ద నిందితులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను చూసి వెళ్తుండగా మృత్యుఒడిలోకి..

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీకొన్న బైక్
- తలకు తీవ్రగాయాలై వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)



నుజ్జునుజ్జయిన కారు, బైక్

పెద్దవూర: ద్విచక్రవాహనం లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీకొనగా.. తలకు తీవ్ర గాయాలై వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన పెద్దవూర మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి గ్రామానికి చెందిన జానపాటి లక్ష్మయ్య(42) గ్రామంలో వ్యవసాయంతో పాటు పెద్దవూరలో హోటల్ నిర్వహిస్తున్నాడు. గత సంవత్సరం అనావృష్టితో పంటలు ఎండిపోయి పంట దిగుబడులు రాక అప్పుల పాలయ్యాడు. హోటల్ సైతం బాగా నడవకపోవడంతో నష్టాలు వచ్చాయి. దీంతో ఐదు నెలల క్రితం హాలియాలోని తన స్నేహితుడి ప్రింటర్స్‌లో పనిలో కుదిరాడు. అక్కడే ఇంటిని అద్దెకు తీసుకుని కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి తన స్వగ్రామమైన తుంగతుర్తికి తన తల్లిదండ్రులను చూడటానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై హాలియాకు వెళ్తుండగా జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై పెద్దగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును వేగంగా ఢీకొట్టాడు. దీంతో అతను ఎగిరి కారు వెనుక వైపు అద్దంపై పడి అనంతరం రోడ్డుపై పడిపోయాడు. దీంతో లక్ష్మయ్య రెండు చేతులు, ఒక కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వారికి సైతం గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో వారిని మిర్యాలగూడెం తరలించారు. లక్ష్మయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా చికిత్స ప్రారంభించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మేళ్లచెరువు: మేళ్లచెరువు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన మహిళ కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్లటూరు గ్రామానికి చెందిన జ్యోతి(36)కి 18 సంవత్సరాల క్రితం కొండల్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కాగా.. జ్యోతి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ నెల 16న మళ్లీ కడుపునొప్పి రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందింది. అయినా నొప్పి తగ్గకపోవడంతో భరించలేక ఈనెల 17న ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన భర్త హుటాహుటిన హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేష్ పేర్కొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

మిర్యాలగూడ అర్బన్: గర్భిణి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆమె బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ మండలం ట్యాంక్‌తండాకు చెందిన దనావత్ మానిక(28) గర్భిణి కావడంతో ఆమె భర్త రాజేష్ ఈ నెల 14న పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు బీపీ ఎక్కువగా ఉందని వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించడంతో ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ నెల 15న బీపీ అదుపులోకి రావడంతో సిజేరియన్ చేయగా మగశిశువుకు జన్మనిచ్చింది. ఈ నెల 17న అర్ధరాత్రి మానిక తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. రాత్రి సమయంలో వైద్యులు అందుబాటులో ఉండి చికిత్స అందించకపోవడంతోనే ఆమె పరిస్థితి విషమించి మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. ఇరువర్గాలకు చెందిన వారు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గాయాలు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ మండల పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వాటర్ మెన్ ఎర్ర ఉప్పయ్య శుక్రవారం వీధి కుక్కల దాడిలో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పయ్య రోజు మాదిరిగా వీధుల్లో నల్లాలకు నీళ్ల పెట్టేందుకు వెళ్తుండగా కుక్క దాడి చేసింది. ఈ దాడిలో ఉప్పయ్య కుడి కాలుకు గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్‌పై ఫిర్యాదు

కోదాడ రూరల్: మండల పరిధిలోని ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు సంఘంలో అక్రమాలు, అవినీతిలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ సీఈఓ హస్సేన్ శుక్రవారం డీసీఓకు ఫిర్యాదు చేశారు. చైర్మన్, ఆయన భార్య పేరు మీదపై రూ.25లక్షల గోల్డ్‌లోన్ తీసుకొని వడ్డీ కట్టకుండా, రెన్యూవల్ చేయకుండా డీ ఫాల్టర్ అయ్యారని సీఈఓ తెలిపారు. గోల్డ్ తూకం వేసే మిషన్ రూ.9వేలు కాగా రూ.30వేలు బిల్లు డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. సంఘంలోని రూ.8లక్షలను సొంతానికి వాడుకొని తిరిగి చెల్లించలేదని, పాలకవర్గంలో ఓ డైరెక్టర్ రూ.లక్ష వ్యక్తిగత రుణం తీసుకుంటే రూ.7వేలు తగ్గించి కట్టేవిధంగా తనపై ఒత్తిడి తెచ్చారన్నారు. పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు నిర్మా ణం చేపడదామని రెండేళ్ల క్రితం సదరు కంపెనీకి, స్థల లీజుకు రూ.2.25 లక్షలను ఇచ్చి నేటి వరకు పనులు చేపట్టలేదని తెలిపారు. పంట రుణాల విషయంలో తనకు గిట్టని రైతులకు సంతకం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, డిఫాల్టర్ అయిన చైర్మన్‌కు సీఈఓను తొలగించే అర్హత లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.


రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

నల్లగొండ రూరల్: రాష్ట్ర రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక శుక్రవారం నల్లగొండలో నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా అయోధ్య, జాయింట్ సెక్రటరీగా గోలి లక్ష్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసులు, చీఫ్ అడ్వయిజర్‌గా ఎంఏ రహీమ్ ఎన్నికయ్యారు.

మట్టపల్లిలో విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం విశేష పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం నిర్వహించారు. ముందుగా శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

ఇద్దరు కుమారులు ఉన్నా.. భిక్షాటన

- దీనస్థితిలో జీవనం సాగిస్తున్న వృద్ధురాలు
- అధికారులకు సమాచారం అందించిన అంగన్‌వాడీ సిబ్బంది
- సూర్యాపేటలోని వయోవృద్ధుల అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమానికి తరలించిన అధికారులు



వృద్ధురాలు అంజమ్మను సూర్యాపేటలోని ఆశ్రమానికి తరలిస్తున్న అధికారులు

నకిరేకల్: నకిరేకల్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలికి మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారులు ఆశ్రయం కల్పించారు. తాటికల్ రోడ్డులో నివాసం ఉంటున్న వెంట్రప్రగడ అంజమ్మ(73)కు ఇద్దరు కుమారులు. కుమారులు చిన్నతనంలో ఉన్నప్పుడే భర్త చనిపోయాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో భిక్షాటన చేస్తూ తన ఇద్దరు పిల్లలను పోషించింది. ప్రస్తుతం కుమారులు ఎవరికి వారు జీవనం సాగిస్తున్నారు. దీంతో అంజమ్మ ఒంటరిగా మిగిలింది. ఆమె గత 15 రోజులుగా భిక్షాటన చేస్తూ దీనస్థితిలో కనిపించడంతో చీమలగడ్డ ప్రాంత అంగన్‌వాడీ సిబ్బంది సమాచారం మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మహిళా శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖ టోల్ ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేసి తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి ఆదేశాల మేరకు మహిళా శిశు వికాలంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి శుక్రవారం నకిరేకల్‌కు చేరుకుని వృద్ధురాలు అంజమ్మను కలిసి, ఆమె చిన్న కుమారుడిని పిలిపించారు. అతను తన తల్లిని సాదే స్థితిలో లేనని వారికి తెలిపాడు. దీంతో ఆమెను సూర్యాపేటలోని వయోవృద్ధుల అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమానికి తరలించారు.